

ఎనీ టైమ్ మందు!



- దుకాణాలకు అనుబంధంగా అనధికారిక పర్మిట్ రూమ్‌లు
- లూజు అమ్మకాలతోపాటు మద్యం సేవించడానికి ఏర్పాట్లు
- గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు
- తీవ్రంగా పరిగణించని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు
- హెచ్చరికలకే పరిమితమైన జరిమానాలు, లైసెన్సుల రద్దు

నిబంధనలు బేఖాతరు చేస్తున్న మద్యం వ్యాపారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మద్యం దుకాణాలను అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు (మద్యం సేవించడానికి) నిర్వహిస్తున్నారు. మరోవైపు మద్యం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో 24/7 మందు అందుబాటులో వుంటున్నది. కారణాలు ఏమిటో తెలియదు గానీ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, పోలీసు శాఖల అధికారులు సీరియస్‌గా పట్టించుకోవడంలేదు.

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తరువాత అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో 136 ప్రైవేటు మద్యం దుకాణాలు లాటరీ ద్వారా ప్రభుత్వం కేటాయించింది. బెల్టు షాపులు నిర్వహించకూడదని, మద్యం దుకాణానికి అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయవద్దని, షాపుల్లో ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకే మద్యం విక్రయించాలని నిబంధనలు విధించింది. వీటిని అతిక్రమిస్తే భారీ జరిమానాతోపాటు లైసెన్సును సైతం రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. కానీ మద్యం వ్యాపారులు ఇవేమీ పట్టించుకోవడంలేదు.

అనధికార పర్మిట్ రూమ్‌లు

మద్యం షాపుల్లో లూజు అమ్మకాలకు అనుమతి లేదు. కానీ కొంతమంది మద్యం వ్యాపారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మద్యం దుకాణాల వెనుక లేదా సమీపంలో అనధికార పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మద్యం విడి అమ్మకాలతోపాటు ఇక్కడ మద్యం సేవించడానికి మందు బాబులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. టేబుళ్లు, కుర్చీలు వేసి వాటర్ ప్యాకెట్‌లు, తినుబండారాలను అందుబాటులో వుంచుతున్నారు. అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటలో జాతీయ రహదారికి ఆనుకొని వున్న మద్యం షాపు నిర్వాహకులు.. అక్కడే వున్న ఒక కిల్లీ బడ్డీలో మందుబాబులు తాగేందుకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా జాతీయ రహదారికి ఆనుకొని వున్న పలు దాబాల్లో అనధికారికంగా మద్యం అమ్మకాలతోపాటు తాగడానికి కూడా అనుమతి ఇస్తున్నారు. పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో చిన్నపాటి హోటళ్లు, దాబాల్లో మద్యం సేవించే వారిని నిర్వాహకులు ప్రోత్సహిస్తున్నారు. సబ్బవరంలో ఒక మద్యం షాపు నిర్వాహకులు దుకాణం వెనుక వున్న ఖాళీ స్థలంలో టెంట్లు వేసి మరీ మద్యం తాగడానికి ఏర్పాట్లు చేశారు.



అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటలో మద్యం దుకాణం ఎదుట కిల్లీ బడ్డీ వద్ద మద్యం సేవిస్తున్న దృశ్యం

విచ్చలవిడిగా బెల్టు షాపులు

మద్యం షాపులకు అనుబంధంగా పలుచోట్ల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. కిల్లీ బడ్డీలు, కాకా హోటళ్లు, దాబాల్లో మద్యం లభిస్తున్నది. ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలశాయి. సమీపంలోని లైసెన్సుడ్ మద్యం షాపుల నుంచే సరకు సరఫరా అవుతున్న విషయం బహిరంగ రహస్యం. నర్సీపట్నం, సబ్బవరం, చోడవరం, ఎలమంచిలి, మాడుగుల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో బెల్ట్ షాపులు అధికంగా వున్నట్టు చెబుతున్నారు. మద్యం బెల్టు షాపుల నిర్వహణ కోసం కొన్ని గ్రామాల్లో వేలం పాటలు సైతం నిర్వహించారు. ఈ విషయం పత్రికల్లో వచ్చినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే తప్ప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు జరపడం లేదు. ఒకవేళ తనిఖీ జరిపి మద్యం పట్టుబడితే కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం విధిస్తున్నారే తప్ప బెల్టు షాపులకు ఏ దుకాణం నుంచి మద్యం సరఫరా అయ్యిందో తెలుసుకునే ప్రయత్నం చేయడంలేదు. బెల్టు షాపులకు ... మిగతా 8వ పేజీలో

రోలుగుంటలో పర్మిట్ రూమ్

- మద్యం షాపు పక్కనే నిర్వహిస్తున్న యజమానులు
- పలు గ్రామాల్లో బెల్టు షాపులు

రోలుగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో ప్రైవేటు మద్యం దుకాణం ఏర్పాటు చేసిన నిర్వాహకులు అనధికారికంగా పర్మిట్ రూమ్ నిర్వహిస్తున్నారు. మద్యం షాపునున ఆనుకుని మందుబాబులు కూర్చుని మద్యం సేవించడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు మందుబాబుల జోరు ఎక్కువైంది. మద్యం దుకాణాల వద్ద సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మందుబాబుల హడావిడి అధికంగా వుంటున్నది. మద్యం కొనుగోలు చేసిన తరువాత కొంతమంది సమీపంలోనే తాగేస్తూ ఆయా ప్రదేశాలను ఓపెన్ బార్‌లుగా మార్చేస్తున్నారు.

ఇక మండలంలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలకు అనుబంధంగా రోలుగుంట, కొమరవోలు, కొవ్వూరు, కొండపాలెం, నిండుగొండ, పడాలపాలెం, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. వీటి వద్ద వేళాపాళా లేకుండా బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బెల్టు దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగుతున్నది. కాగా బెల్టు షాపులు నిర్వహిస్తే సంబంధిత లైసెన్సుడ్ షాపు యజమానికి రూ.5లక్షల జరిమానా విధిస్తామని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ చెప్పారు. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రోలుగుంటలో మద్యం షాపు పక్కన అనధికారికంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్

కాగుతున్న వంట నూనెలు

రోజు రోజుకీ పెరిగిపోతున్న ధరలు

- సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.150, వేరుశనగ నూనె రూ.170
- పామాయిల్ రూ.135
- నాలుగు నెలల్లో 40 శాతం వరకు పెరుగుదల



సన్ ఫ్లవర్ ఆయిల్ బాటిల్స్

నర్సీపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

బహిరంగ మార్కెట్లో వంట నూనె ధరలు సల సల కాగుతున్నాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.150కి చేరింది. పామాయిల్ సైతం రూ.135కి అమ్ముతున్నారు. వేరుశనగ నూను రూ.170కి చేరింది. ఎప్పటికప్పుడు ధరలు పెరుగుతుండటంతో పలు సంస్థలు ఆన్‌లైన్‌లో వంట నూనె విక్రయాలను ఆపేశాయి.

నర్సీపట్నం ప్రముఖ వ్యాపార కూడలి కావడంతో చుట్టుపక్కల వున్న నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల, నాతవరం మండలాలతోపాటు ఏజెన్సీలోని కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి చిన్న వ్యాపారులు, ప్రజలు ఇక్కడకు వచ్చి కిరాణా సరకులు, వంట నూనెలు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు ఆయా సరకులను విశాఖపట్నం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలను దిగుమతి చేసుకుంటుంటారు. కాగా పప్పు దినుసుల ధరలు ఏడాది క్రితమే విపరీతంగా పెరిగి, కిందకు దిగిరావడంలేదు. ఇప్పుడు వంట నూనెల ధరలు కూడా అదే బాటపట్టాయి. సుమారు నాలుగు నెలల నుంచి వంట నూనెల ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఈ ఏడాది జూలైలో సన్‌ఫ్లవర్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్ ధరలు లీటరు రూ.110కి కొంచెం అటుఇటు వుండగా.. తరువాత నుంచి పెరుగుతూ వస్తున్నాయి. వారం రోజుల క్రితం సన్ ఫ్లవర్ అయిల్ రూ.140కి విక్రయించగా బుధవారం రూ.150కి చేరింది. పామాయిల్ సైతం రూ.120 నుంచి రూ.135కి చేరింది. వేరుశనగ నూనె రూ.170, రైస్ బ్రాన్ ఆయిల్ రూ.155కి అమ్ముతున్నారు. హోల్ సేల్ మార్కెట్లో సన్‌ఫ్లవర్ నూనె డబ్బా (15 లీటర్లు) రూ.2200, పామాయిల్ రూ.2,050లకు విక్రయిస్తున్నారు. ఇళ్లల్లో వంటలకు ఎక్కువ శాతం మంది సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను వినియోగిస్తుంటారు. తినుబండారాల తయారీదారులు, టిఫిన్ సెంటర్లు, బజ్జీ/ పకోడీ బళ్లవారు పామాలిన్‌ను అధికంగా వాడుతుంటారు. నాలుగు నెలల వ్యవధిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర 40 శాతం, పామాయిల్ ధర 35 శాతం పెరిగింది. వంట నూనెల ధరల పెరుగుదల ప్రభావం అన్ని వర్గాల ప్రజలపైనా పడుతున్నది. కాగా కేంద్ర ప్రభుత్వం ముడిచమురుపై దిగుమతి సుంకం తగ్గించే వరకు వంట నూనెల ధరలు ఇలాగే కొనసాగుతాయని వ్యాపారులు అంటున్నారు.

సెంట్రల్ జైలులో భద్రతాలోపంపై సీరియస్

- గత సూపరింటెండెంట్, అదనపు సూపరిటెండెంట్‌లపై సస్పెన్షన్ వేటు - 8లో

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

'రాగూర్ లేబొరేటరీస్' ఘటనపై భిన్నవాదనలు

- యాజమాన్యం చెప్పిందే వేదం అన్నట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
- సొంత పరిశీలన, విచారణ శూన్యం
- వాస్తవాలకు ముసుగు
- అసలు అక్కడ విష వాయువులు ఎలా లీకయ్యాయో నిర్ధారించని వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాగూర్ ఫార్మా కంపెనీలో ప్రమాదంపై అసలు విషయాలు బయటకు రావడం లేదు. ఆ కంపెనీ అనుమతి లేని మందులు తయారు చేస్తున్నప్పుడు ప్రమాదం జరగ్గా...ఆ ఘటనపై యాజమాన్యం చెప్పిన విషయాలనే అధికారులు వల్లె వేస్తున్నారు. వాస్తవంగా ఏమి జరిగింది అనేది వెల్లడించడం లేదు. అసలు వారు అన్నీ సక్రమంగా పరిశీలించారా?...అనే అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. కంపెనీ యాజమాన్యాన్ని కాపాడడానికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తోంది.



ప్రమాదం జరిగిన తరువాత అక్కడకు ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెళ్లారు. వారు స్వతంత్రంగా విచారణ చేయలేదని, భిన్నమైన సమాచారం ఇచ్చారని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. లామివుడీన్ (హెచ్ఐవీ మందు) ఉత్పత్తి మూడో దశలో ఉండగా ప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీస్ విభాగం వెల్లడించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం 'పాంటోప్రజోల్' మూడో దశ ఉత్పత్తిలో ఉండగా ప్రమాదం జరిగిందని, క్లోరిన్ వాయువు వెలువడిందని నివేదించింది. ఈ రెండు ... మిగతా 8వ పేజీలో

సంక్షోభంలో మరో ఫెర్రో పరిశ్రమ

రెండు నెలలుగా జీతాలు ఇవ్వని అల్లాయిస్ ఫ్యాక్టరీ యాజమాన్యం

- ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన
- దిగి వచ్చిన యాజమాన్యం.. ఒక నెల జీతం ఇవ్వడానికి అంగీకారం
- పది రోజుల క్రితం ఇదే తరహాలో కార్మికులు ఆందోళన

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దినదిన గండంగా తయారైంది ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లోని ఫెర్రో అల్లాయిస్ కర్మాగారాల పరిస్థితి. అంతర్జాతీయ మార్కెట్లో ఫెర్రో ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిపోతే.. ఆ ప్రభావం కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులపై పడుతున్నది. ఆయా యాజమాన్యాలు ఉన్నఫళంగా ఫ్యాక్టరీలను మూసి వేసి కార్మికులను రోడ్డున పడేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులకు సైతం జీతాలు పెండింగ్ పెడుతున్నారు. ఈ తరహాలో సెజ్‌లో అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కర్మాగారాన్ని రెండు నెలల నుంచి మూసివేయగా, దీని పక్కనే 'రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో నడుస్తున్న మరో ఫెర్రో అల్లాయిస్ కార్మాగారం యాజమాన్యం ఉద్యోగులకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడంలేదు. ఈ ఫ్యాక్టరీలో 335 మంది కాంట్రాక్టు కార్మికులు, 45 మంది శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో బుధవారం ఉద్యోగులు విధులు బహిష్కరించి ఫ్యాక్టరీ నుంచి బయటకు వచ్చేశారు. రెండు గంటల తరువాత యాజమాన్యం స్పందించి ఉద్యోగులతో చర్చలు జరిపింది. ఇప్పుడు ఒక నెల జీతం ఇస్తామని, వారం రోజుల్లో మరో నెల జీతం ఇస్తామని హామీ ఇవ్వడంతో ... మిగతా 8వ పేజీలో



ఫ్యాక్టరీ నుంచి బయటకు వచ్చిన ఫెర్రో అల్లాయిస్ ఉద్యోగులు

నేడు ముఖ్యమంత్రి రాక

రాత్రికి పార్టీ కార్యాలయంలో బస

- 6న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'కు హాజరు
- అనంతరం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి నగరానికి రానున్నారు. ముంబైలో మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరై...అక్కడ నుంచి రాత్రి 7.30 గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి రాత్రి 10.05 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక గల టీడీపీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారని అధికారులు వెల్లడించారు. ఆరో తేదీ కార్యక్రమాల వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. తరువాత నోవాటెల్‌లో జరగనున్న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. అనంతరం వీఎంఆర్‌డీలో అధికారులతో సమీక్ష నిర్వహించి రాత్రికి విజయవాడ వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పార్టీ కార్యాలయం, తదితరచోట్ల జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, ఏడీసీపీలు, ఏసీపీలు టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. పార్టీ కార్యాలయ భవనం మొత్తం తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం బాంబ్, డాగ్ స్క్వాడ్లు పార్టీ కార్యాలయం ఆవరణ, లోపల తనిఖీలు చేపట్టాయి.



సీఎం పర్యటన సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

'రాగూర్' ఫార్మాపై కేసు నమోదు

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి జిల్లా పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. ఫ్యాక్టరీలో వారం కిందట విష వాయువు లీకవ్వడంతో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో 30 మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంగతి తెలిసిందే. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ప్రమాద తీవ్రత పెరిగిందని అధికారులు తేల్చారు. దీనిని తీవ్రంగా పరిగణించి వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నిర్లక్ష్యం, మానవ ప్రాణాలకు హాని కలిగించడం, ప్రమాదాన్ని అధికారులకు తెలియకుండా దాచిపెట్టడం, తదితర అభియోగాలపై కేసు నమోదుచేశారు.

భారతీయ న్యాయ సహిత సెక్షన్ 106 (1), 125 (ఎ), 125 (బి), 239, 286 రెడ్‌విత్ 3 (5) కింద కేసు నమోదుచేసినట్టు సీఐ వెల్లడించారు. ఇదిలావుంటే అస్వస్థతకు గురైన ఉద్యోగుల్లో ఇంకా 11 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వారిని రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- జనవరి 8వ తేదీ వరకు నిర్వహణ
- గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించుకోవాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష జరిపారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణకు మండల అధికారులు షెడ్యూల్ తయారు చేసుకుని, ఈ వివరాలను ప్రజలకు, ప్రజాప్రతినిధులు తెలియపరచాలని చెప్పారు. తహసీల్దార్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ దయానిధి, ఆర్డీఓలు ఆయేషా (అనకాపల్లి), వీవీ రమణ (నర్సీపట్నం) వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విజయకృష్ణన్, కలెక్టర్

తహసీల్దార్ కార్యాలయం వద్ద వినాయక విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలో రెవెన్యూ సిబ్బంది

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలుత వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుక జరిగింది. అనంతరం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వోలతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం కాలువలో అర్ధరాత్రి మట్టి తవ్వకాలు

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిబంద సమీపం పోలవరం ఎడమ కాలువ పరిధిలో మంగళవారం రాత్రి గుట్టుగా మట్టి తవ్వకాలు జరిగినట్టు స్థానికులకు తెలిసింది. ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వించి, మూడు లారీల ద్వారా మట్టిని తరలించినట్టు ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు కొందరు ప్రయత్నించగా, అక్కడి నుంచి సదరు తవ్వకం దారులు వాహనాలతో సహా వెళ్లిపోయినట్టు సమాచారం. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో రికార్డు సాధించాలి : ప్రగడ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి నియోజకవర్గం జిల్లాలో రికార్డు సాధించాలని ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చీమలాపల్లిలో బుధవారం సభ్యత్వ నమోదును పరిశీలించి మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు మంచి స్పందన కనిపిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలతో పాటు యువకులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనపరెడ్డి నర్సింగరావు, మామిడి శివ అప్పారావు, పెయ్యల గిరి, గుర్రాల శివ, కోల నాగేశ్వరరావు, మజ్జి అప్పల రాజు, గుర్రాల వరహాలమ్మ, కర్రి ఆదినాయుడు, నగిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఘంటసాల గాన మాధుర్యం అజరామరం

▸▸ జయంత్యుత్సవంలో కీర్తించిన ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు ▸▸ ఆద్యంతం ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి పాటల పోటీ



ఘంటసాల చిత్రపటం వద్ద చైర్‌పర్సన్ రమాకుమారి తదితరుల నివాళి

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ డాక్టర్ ఘంటసాల వెంకటేశ్వరరావు తన గాన మాధుర్యంతో ప్రపంచాన్ని మెప్పించారని ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఎలమంచిలిలో బుధవారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటసాల గళం నుంచి జాలువారిన గానాలు అజరామరం అని కీర్తించారు. తొలుత ఈ వేడుకలను మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ప్రారంభించారు. ఇదిలావుంటే, ఉదయం నుంచి సాయంత్రం వరకు పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించిన పాటల పోటీ ఆద్యంతం ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు చక్కని పాటలు పాడి అందరినీ మెప్పించారు. సీనియర్స్ విభాగంలో ఎలమంచిలి మండలం పరిధి కొక్కిరాపల్లికి చెందిన పీవీఎస్ హరిణి ప్రథమ, రాజమండ్రికి చెందిన కె.దుర్గాప్రసాద్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ విభాగంలో ఎలమంచిలి మండలం సోమలింగపాలేనికి చెందిన పి.లహరి ప్రియ ప్రథమ, కశింకోట మండలం తాళ్లపాలేనికి చెందిన ఎన్.త్రివేణి ద్వితీయ, నక్కపల్లికి చెందిన సీహెచ్.పవిత్ర తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. వీరితో పాటు పలువురిని కన్సొలేషన్ బహుమతులకు ఎంపిక చేశారు. వీరికి ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావుతో పాటు ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు తదితరులు బహుమతులు అందజేశారు. ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కరణం రవికుమార్, పల్లా సత్యనారాయణ, ఎన్.సుబ్బయ్యనాయుడు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు

ఎలమంచిలిలో భూకంపం?

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం రాత్రి భూమి కంపించినట్టు పలువురు తెలిపారు. సుమారు ఏడు గంటల నుంచి రెండు నిమిషాల పాటు ఇళ్లలో ఉన్న వస్తువులు కదిలినట్టు వివరించారు. ఇదిలావుంటే, ఈ ఘటనపై పలువురు చర్చించుకోవడం కనిపించింది.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



పాఠశాలకు ఫ్యాన్లు అందిస్తున్న ఎంపీపీ

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లను బుధవారం వితరణగా అందజేశారు. పాఠశాల సముదాయంలో విద్యార్థులు భోజనం చేసే గదిలో వీటిని ఏర్పాటు చేయాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి తాను హాజరైనప్పుడు ఫ్యాన్లు లేకపోవడంతో పిల్లలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రమ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాండ్రేగుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల పూడ్చివేతపై 'రెవెన్యూ'కు ఫిర్యాదు



చర్చికి సమీపంలో పంట కాలువపై అనధికార మార్గం

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పెద్ద మదుం నుంచి మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ప్రధాన రోడ్డు మార్గాన్ని ఆనుకొని ఉన్న సాగునీటి కాలువలను అనుమతులు లేకుండా పూడ్చుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ వినయ్ బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులను కోరారు. స్థానిక చర్చి, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న పంట కాలువల్లో గొట్టాలు వేసి రోడ్డుమార్గాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కారణంగా పంట పొలాలు నీటిముంపునకు గురవుతున్నట్టు రైతు సంఘ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాటిని గతంలో తొలగించడం జరిగిందన్నారు. మళ్లీ యథావిధిగా పంట కాలువపై రోడ్డుమార్గాలు ఏర్పాటు చేసుకుంటున్నారని ఆరోపించారు. పగలు తొలగిస్తే రాత్రిపూట కప్పుతున్నందున చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావుకు, ఎస్‌ఐ వి.ప్రసాదరావులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు పరిహారం పెంచాలి

▸▸ నష్టం ఎక్కువగా జరుగుతుంది ▸▸ సమావేశంలో పలువురు అభిప్రాయం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ స్వామిసత్యనారాయణ

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం పూడిమడక రోడ్డు విస్తరణ నిర్వాసితులు బుధవారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ మాట్లాడుతూ నిర్వాసితులకు నష్టం ఎక్కువగా జరుగుతున్నందున పరిహారం పెంచే దిశగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. రోడ్డు విస్తరణ అంశం సుమారు 18 సంవత్సరాలు నుంచి ఉందన్నారు. విలువైన భూములు, భవనాలు, ఇళ్ల స్థలాలు పోతున్నాయని, అయితే ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉందని వాపోయారు. పరిహారం పెంపుతో పాటు పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు నాలుగైదు రోజుల్లో జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలుద్దామని సూచించారు. టీడీపీ సీనియర్ నేత మొల్లేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులను నిర్వాసితులు కలిసి సమస్యలు చెప్పుకోవడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పెంటకోట జగన్నాథంనాయుడు, పొలిమేర గణేశ్, పొలమరశెట్టి అప్పలనాయుడు, మళ్ల కాశి, ఆడారి అప్పలనాయుడులతో పాటు పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

'సీపీఎస్ రద్దు సభను విజయవంతం చేయాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న సీపీఎస్ రద్దు సభను విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 నాటి పాత పింఛన్ విధానాన్ని తీసుకురావాలనే ఉద్దేశంలో ఈ నెల పదో తేదీన విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బొత్స వెంకటేశ్వరరావు, పట్నాల నాగేశ్వరరావు, మద్దిల నానాజీ, నక్క అప్పలనాయుడు, కృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్‌ఈఏ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాడ్రాపల్లి గ్రామంలో రైతులకు బుధవారం సబ్సిడీపై వరి విత్తనాలను అందజేశారు. ఆర్‌బీకే ద్వారా బుధవారం అవసరమైన రైతులకు జీలకర్ర సన్నాలు రకం విత్తనాలు అందజేయడం జరిగిందని వ్యవసాయ సహాయకురాలు తులసి తెలిపారు. జిల్లా తెలుగురైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు, వార్డు సభ్యుడు సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం

▸▸ జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి చంద్రశేఖర్‌దేవ్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్

ఎస్.రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ చెప్పారు. మండలంలోని పెదగుమ్ములూరు, కొరుప్రోలు గ్రామాల్లో నిర్వహిస్తున్న చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వి.శివరామకృష్ణ కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పుట్టిన దగ్గర నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఏ విధంగా జరుగుతున్నాయో సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం చంద్రశేఖర్‌దేవ్ మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే 2.5 కిలోలపైన బరువు గల ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిస్తారని చెప్పారు. అలాగే తల్లి సహజసిద్ధంగా అందించే పాలు బిడ్డకు ఆరోగ్యమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే 24 గంటలలోపు జీరో డోసు ఓపీవీ, బీసీజీ, హెపటైటిస్ బి వ్యాక్సిన్ చేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జమయమ్మ, ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చెందిన కొల్నాటి నాగ తరుణ్, మనబాల దిలీప్‌కుమార్ జాతీయ స్థాయి అండర్-14 హాకీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం రాణీలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెలాఖరున బోపాల్‌లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ అద్నూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కొల్నాటి రేవతి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టీ సుందరరావు, ఉపాధ్యాయులు టీవీ రమణ, షేక్ బీబీ అభినందించారు.

కృష్ణుడి ఆలయానికి గెడ్డం బుజ్జి విరాళం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపేట గ్రామంలో ఉన్న కృష్ణుడి గుడి అభివృద్ధి కోసం జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి తన వంతు సాయంగా రూ.25 వేల విరాళం అందజేశారు. మండలంలోని గుంటపల్లిలో బుధవారం గెడ్డం బుజ్జి స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కృష్ణుడి గుడి కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందించారు.

లింక్ రోడ్లు అధ్వానం.. బిక్కు బిక్కు మంటూ ప్రయాణం!

మెయిన్ రోడ్డుకు ఇరువైపులా మార్గాలు గతుకుల మయం

పట్టించుకోని అధికారులు.. వాహన చోదకుల అగచాట్లు

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు కాలనీల్లోకి వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లను కనీసం పట్టించుకోని కారణంగా గోతులతో దారుణమంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తుండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పాయకరావుపేటలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు ఉన్న మెయిన్ రోడ్డును సుమారు రూ.2 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. రోడ్డు వేసిన కాంట్రాక్టర్ మెయిన్ రోడ్డును ఆనుకుని వివిధ కాలనీల్లోకి వెళ్లే లింక్ రోడ్లను మెయిన్ రోడ్డు నుంచి సుమారు పది మీటర్ల వరకు అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. పాయకరావుపేట మెయిన్ రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా నాలుగు అడుగుల వెడల్పు బెర్మ్‌లు వేశారు తప్ప మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న లింక్ రోడ్లను కనీసం గ్రావెల్ వేయకుండా వదిలివేయగా, పనులు చేయించిన వీఎంఆర్డీఏ అధికారులు కూడా పట్టించుకోలేదు. దీంతో ఆయా కాలనీల్లో నివాసముంటున్న ప్రజలు గోతుల రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు గోతులు చెరువులను తలపిస్తుండడంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. రాత్రి సమయంలో ఏమాత్రం ఆదమరిచినా వాహనాలతో గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. సోమవారం రాజుగారిబీడులో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన హోం మంత్రి అనిత గోతుల రోడ్డుపైనే రావాల్సి ఉండడంతో టీడీపీ నాయకులు అప్పటికప్పుడు గోతులను చిప్స్, క్రషర్‌తో పూడ్చాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న లింక్ రోడ్లలో గోతులు పూడ్చి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



నీటి కుంటలను తలపిస్తున్న రాజుగారిబీడులోకి వెళ్లే లింకు రోడ్డు



చెరువులా మారిన గుంటపల్లి కాలనీలోకి వెళ్లే లింక్ రోడ్డు



చెరువును తలపిస్తున్న గెస్టు హౌస్ ఎదురు కాలనీలోకి వెళ్లే రోడ్డు

దూడల మరణాలను నివారించండి

▸▸ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ వీర్రాజు



రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎస్.రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దూడ పెయ్యల మరణాలను అరికట్టే పద్ధతులను పాడి రైతులు తెలుసుకోవాలని పశు సంవర్ధక శాఖ నక్కపల్లి సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు (ఏడీ) ఎం.వీర్రాజు సూచించారు. మండలంలోని వేమగిరి గ్రామంలో బుధవారం గర్భకోశ వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఉచిత పశువైద్య శిబిరంతో పాటు పాడి రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఏడీ ఎం.వీర్రాజుతో పాటు పశు వైద్య నిపుణులు డాక్టర్ భానుబాబు, డాక్టర్ డి.వంశీకృష్ణ యాదవ్, డాక్టర్ ఎస్.సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ దూడ పెయ్యల మరణాలను అరికట్టే పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో 35 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 14 పశువులకు చూడి పరీక్షలు చేయడంతో పాటు 32 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు. అలాగే 30 పెయ్యలకు నట్టల నివారణ మందులు అందజేయడం జరిగిందని లింగరాజుపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ కె.భరత్ కుమార్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం వైద్యుల చేతుల మీదగా 50 మంది పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అబ్బాయిదొర, మాజీ సర్పంచ్ పి.రంగారావు, వీఎల్‌వో ఎం.వెలంగిరాజు, పశు సంవర్ధక ఏడీ అవనికుమారి, గోపాలమిత్ర ప్రసాదరావు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి: ఏవో

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ తెలిపారు. మండలంలోని సత్యవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే రానున్న మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే కోత కోసిన పంటను త్వరగా కుప్పలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, పశు వైద్యాధికారి సాయిశంకర్, ఉద్యాన సహాయకులు అజయ్, అమృత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

నక్కపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పాఠశాల ఉపాధ్యాయులే సొంత నిధులతో కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నారాయణరావు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్న ఉద్దేశంతో ఉపాధ్యాయులంతా సహకరించి విలువైన స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీఎస్ రావు, జి.మురళి, వై.అప్పారావు, అర్జున అప్పారావు, జీఎల్ సూర్యకుమారి పాల్గొన్నారు.

కిరాణా షాపు యజమానికి తిరిగొచ్చిన సొమ్ము

▸▸ మార్చిలో బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.29 లక్షలు మాయం

▸▸ సీఐ జి.అప్పన్న కృషితో రికవరీ

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిరాణా షాపు యజమాని రెడ్డి అప్పారావుకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల నుంచి మాయమైన ఈ ఏడాడి మార్చిలో రూ.1.29 లక్షల నగదు బుధవారం తిరిగి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పాయకరావుపేటలోని డీసీసీబీ బ్యాంకు పక్కనే ఉన్న కిరాణా షాపు వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సుమారు రూ.6 వేల విలువైన సామానులు కొనుగోలు చేసి తన ఫోన్ పే ద్వారా పేమెంట్ కావడం లేదని చెప్పి స్నేహితుడి సెల్ నంబరుకి షాపు యజమాని అప్పారావు సెల్ నుంచి రూపాయి ఫోన్ పే ద్వారా చేసిన కొద్ది నిమిషాల్లో అప్పారావు చెందిన రెండు బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.99,000, రూ.30,900 డెబిట్ అయిన విషయం తెలిసిందే. అప్పట్లో దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ జి.అప్పన్న కృషి ఫలితంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు బ్యాంకులు అప్పారావు బ్యాంకు ఖాతాల నుంచి మాయమైన సొమ్మును బుధవారం తిరిగి జమ చేశాయి. దీంతో బాధితుడు అప్పారావు ఆనందం వ్యక్తం చేశాడు.

చెడు అలవాట్లతో భవిష్యత్తుకు ముప్పు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లతో భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని సీఐ జి.అప్పన్న చెప్పారు. ఈదటం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తుపదార్థాలు, చెడు అలవాట్లకు అలవాటుపడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. చదువుపై పూర్తిగా దృష్టిపెట్టి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచిపేరు తేవాలని ఆయన కోరారు.

పాయకరావుపేటలో కంపించిన భూమి

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో బుధవారం ఉదయం కొన్ని సెకన్లు భూమి కంపించింది. ఉదయం 7.30 గంటలకు ఒక్కసారిగా కుదుపు వచ్చి కొన్ని సెకన్లు కంపించినట్టు అనిపించింది. ఈ సమయంలో ఏ ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా గాన గంధర్వుడు ఘంటసాల జయంతి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఘంటసాల వెంకటేశ్వర రావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.రాధిక పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఘంటసాల తన గాన మధుర్యం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి కీర్తిని చాటిచెప్పారని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ల్యాండ్‌పూలింగ్‌లో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలకు ల్యాండ్‌పూలింగ్ పేరుతో రైతుల నుంచి పెద్ద ఎత్తున చేపట్టిన భూసమీకరణలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం జిల్లా కలెక్టర్‌ను ఓ లేఖలో కోరారు. అనకాపల్లి మండలంలోని పదకొండు గ్రామాల్లో 900 ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించారన్నారు. ల్యాండ్‌పూలింగ్‌కు భూములిచ్చిన రైతులకు అసైన్డ్‌భూమి అయితే ఎకరానికి 18 సెంట్లు, ఆక్రమిత భూమి అయితే ఎకరాకు తొమ్మిది సెంట్లు చొప్పున డీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ప్లాట్‌లను కేటాయిస్తుందని చెప్పారన్నారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది బినామీ పేర్లతో ల్యాండ్‌పూలింగ్‌లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ అంశాన్ని గతంలోనే సీపీఎం పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

'క్వారీ అక్రమ నిర్వహణపై విచారణలో జాప్యం తగదు'



క్వారీ, క్రషర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తుమ్మపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మామిడిపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ, క్రషర్ నిర్వహణపై ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు సకాలంలో ఎందుకు స్పందించడం లేదని ఆ గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు ప్రశ్నించారు. బుధవారం మామిడిపాలెం విచారణకు వచ్చిన అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు గత పధ్నాలుగు రోజులుగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోక పోవడం వెనుక కారణం ఏమిటని నిలదీశారు. ఇప్పటికీ క్రషర్‌లో ఉన్న అక్రమ మెటీరియల్‌ను కొలతలు వేయడానికి పరికరాలు లేవంటూ మైన్స్ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన



బవులవాడలో నిరసన తెలుపుతున్న కార్మికులు

తుమ్మపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బవులవాడలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన కార్మికుడు గాలి సూరిబాబు కుటుంబాన్ని క్వారీ యాజమాన్యం ఆదుకోవాలని క్వారీ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కోన మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం బవులవాడలో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీలో తరుచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వాలు సైతం కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలంలో ఆక్రమణలపై ఫిర్యాదు

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 143/32లో గల శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురైందని తక్షణమే ఆక్రమణలను తొలగించాలని స్థానిక కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఆక్రమించిన స్థలంలో పాన్‌షాపు, కల్లు దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు మద్యం విక్రయాలను గుట్టుగా చేపడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే దుకాణాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఊడి బాబూరావు, ఎం.శివ, కుమార్, పి.శివకృష్ణ, ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టివేత

కొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ సమీపంలో ఉన్న మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులో ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ వై.ఎల్.నాయుడు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, పిల్లి తలుపులు అనే వ్యక్తి అరెస్టు చేశారు. అలాగే, 20 మందిపై మునగపాక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఆర్ట్, క్రాఫ్ట్ ప్రదర్శన



విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో ఆర్ట్, క్రాఫ్ట్‌పై విద్యార్థులు బుధవారం ఏర్పాటు చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాలపై కూడా అవగాహన అవసరమన్నారు. అందుకు అనుగుణంగానే ఇటువంటి ప్రదర్శనలను కళాశాలలో ఏర్పాటు చేయడమైందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. దయామాధురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు చింతలపాలెం

▸▸ దీర్ఘకాలంగా గ్రామస్థులను వేధిస్తున్న సమస్య ▸▸ పట్టించుకోని పంచాయతీ ▸▸ దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు





చింతలపాలెంలోని పలు వీధి రోడ్లపై నిలిచిపోయిన మురుగునీరు



కశింకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెం గ్రామాన్ని మురుగు సమస్య వెంటాడుతోంది. ప్రధానంగా ఇక్కడి నూకాలమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో కాలువలు లేవు. దీంతో స్థానికులు వాడుక నీటిని రోడ్డుపైకి విడిచి పెడుతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మురుగునీటి వల్ల ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది కూడా ఎప్పటికపుడు రోడ్లను శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నిల్వ ఉండిపోయి నాచుపడుతోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కాలువలను, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని వేడుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అంటున్నారు.

ఫలితంగా ఇళ్ల వద్ద దుర్భర వాతావరణం నెలకొందని మదనపడుతున్నారు. వాతావరణం ఇంతలా ఉన్నా ఎప్పటికప్పుడు వీధుల్లో బ్లీచింగ్ చల్లాలనే కనీస ఆలోచనను పంచాయతీ అధికారులు చేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, తరచూ చెత్త సమస్య కూడా ఇక్కడ వేధిస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు తిష్ట



చింతలపాలెం గ్రామం అభివృద్ధి కాలేదు. ఏళ్ల తరబడి ఇక్కడ మురుగు సమస్య వేధిస్తోంది. ఎన్నికల ముందు నాయకులు వచ్చేటప్పుడు అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలి. - బల్లా దేముడమ్మ, చింతలపాలెం

చీకటిపడితే దోమల బెడద



చీకటి పడితే దోమలు విజృంభిస్తున్నాయి. కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇళ్లలో వాడుక నీటిని వీధుల్లో విడిచిపెట్టడం వల్ల వాటిలో రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోంది.

- సేనాపతి వరలక్ష్మి, చింతలపాలెం

తూ.తూ.మంత్రంగా రోడ్డు నిర్మాణం



గత వైసీపీ ప్రభుత్వంలో తూ.తూ.మంత్రంగా గ్రామ ప్రారంభంలో రోడ్డు నిర్మించారు. సమస్య ఎక్కడ ఉందో అక్కడ కాకుండా మరో చోట వేయడం అన్యాయం. మురుగునీరు రోడ్డుపైకి విడిచిపెట్టడం వల్లే గ్రామంలో దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్లతో పాటు కాలువలు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలి - ముచ్చుపల్లి తులసి, నర్సింగబిల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : డీఎస్పీ



బయ్యవరం కూడలిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కశింకోట/ కొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బుధవారం ఆమె పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనకాపల్లి మండలం పిసినికాడ, కేఎస్‌ఆర్‌పేట, కశింకోట మండలం నూతనగుంటపాలెం, గొబ్బూరు, నరసింగబిల్లి, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్ళపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, బయ్యవరం, కశింకోట కూడలిలో ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలను గుర్తించే విధంగా హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. జాతీయ రహదారి అధికారులు, రవాణా శాఖ డీటీవో ప్రకాశరావు, అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ జి.రవికుమార్, ఎలమంచిలి ఆర్‌అండ్‌బీ జేఈ సత్యవాణి పాల్గొన్నారు.


దేవీపురంలో మార్గశిర మాసోత్సవాలు



సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురం గల సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నామని గురుపత్ని అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా హోమాలతో పాటు ప్రతిరోజూ విశేష పూజలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

నేడు వెన్నెలపాలెంలో మరిడిమాంబ పండగ



పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నెలపాలెంలో మరిడిమాంబ పండగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించనున్నారు.

గొర్లివానిపాలెంలో విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలు, కలశాలను ఊరేగిస్తున్న భక్తజనం

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వామి, సరస్వతి, నాగబంధ పసిడి కలశ విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యవచనము, రుత్వికవరుణ, రక్షాసూత్రధారణ, దీక్షాధారణ తదితర క్రతువులు జరిపారు. గురువారం ఉదయం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామని ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

భరణికాన రాజేశ్‌కు ప్రజాప్రతినిధు నివాళి



రాజేశ్ చిత్రపటం వద్ద స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యే పంచకర్ల నివాళి

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు కుమారుడు రాజేశ్ సంతాప సభను బుధవారం దేవీపురం వద్ద నిర్వహించారు. శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి హాజరై రాజేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబూరావును ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, భరణికాన రామారావు, నాయకులు గండి రవికుమార్, ఇందలి వెంకటరమణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాగూర్ యాజమాన్యం పై చర్యలకు డిమాండ్

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం డిమాండ్ చేశారు. గత నెల 26న పరిశ్రమలో విష వాయువులు లీకైన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది ఆస్పత్రి పాలవ్వడానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. హెచ్ఐవీ, హెపటైటిస్-బి ఔషధాల తయారీకి అనుమతులు లేకుండా లామివుడిన్ ఉత్పత్తి చేసి కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, పీసీబీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే అనుమతులు లేకుండా ఔషధాలను కొన్ని కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయని ఆరోపించారు. లామివుడెన్ తయారీపై అవగాహన లేకుండా ఉత్పత్తి చేపట్టడం దారుణమన్నారు. తక్షణమే యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ రమణ

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలోని ప్రతిభ విద్యాలయంలో ఇంటర్ స్కూల్ ప్రతిభ కప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను సీఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.భూషణరావు మాట్లాడుతూ ఈ క్రీడల్లో జిల్లాలోని పది పాఠశాలలకు చెందిన పది జట్లు తలపడుతున్నట్టు చెప్పారు. గత పదేళ్లుగా ఇక్కడ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు గురువారం నగదు బహుమతులు ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, డైరెక్టర్లు శరత్ తేజ, శ్రీవిష్ణుతేజ, హెచ్ఎం కె.కనకమహాలక్ష్మీ, పలువురు పీడీలు పాల్గొన్నారు.

నాలుగు పశువుల పాకలు దగ్ధం



పరవాడపాలెంలో దగ్ధమైన పాకలు

కశింకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పరవాడపాలెంలో నాలుగు పశువుల పాకలు బుధవారం దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులే ఇందుకు కారణమని బాధితులు పందిరి అప్పారావు, పరవాడ ఆదినారాయణ, పడాల గణేష్, భరణికాన అప్పారావులు ఆరోపించారు. కాగా ఇదే మాదిరిగా గతంలో కూడా పాడి పశువుల పాకలు దగ్ధం చేశారని వాపోయారు. తరచూ గ్రామంలో ఈ విధంగా జరుగుతుందని, దీనివల్ల పాడి రైతులం తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి గ్రామంలో పహారా కాసి ఇందుకు పాల్పడిన వారిని పట్టుకోవాలని వారంతా కోరారు.



శిక్షణ సమావేశానికి హాజరైన ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు

'ఫార్మా'ల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

▸▸ ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) కార్యదర్శి జెట్టి సుబ్బారావు సూచించారు. ఇస్రాయి విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫార్మా కనెక్ట్ కెమికల్ సేఫ్టీ శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశ్రమల్లో తప్పనిసరిగా కెమికల్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్మికులు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశ్రమలను నడుపుకోవాలన్నారు. ఈ సమావేశానికి ఫార్మా సంస్థల ప్రతినిధులు ఎస్.మహేశ్వరరావు, వెంకటకృష్ణ, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు మధుసూదనరావు, ఫార్మా పరిశ్రమలకు చెందిన భద్రతా విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐ

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ 2021లో గంజాయి కేసులో పట్టుబడి తప్పించుకుపోయిన తెరవాడ కృపాసాగర్, 2024లో మరో కేసులు తప్పించుకున్న మజ్జి చంటిబాబు అలియాస్ మల్లి చంద్రపడాల్‌ను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అనంతరం అనకాపల్లి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

కల్వర్టుల రక్షణ గోడలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఊటగెడ్డ సమీపంలో దెబ్బతిన్న కల్వర్టుపై రక్షణ గోడ (ఫైల్)



రక్షణ గోడకు ప్రస్తుతం మరమ్మతులు చేపట్టిన దృశ్యం

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి శిథిలమై ఉన్న కల్వర్టుల రక్షణ గోడలకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలోని ఇక్కడి ఊటగెడ్డ జంక్షన్‌కు సమీపంలో ఉన్న రెండు కల్వర్టుల రక్షణ గోడలు పాడయ్యాయి. దీంతో వాహనచోదకులు బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగించే వారు. దీంతో 'కలవరం రేపుతున్న కల్వర్టులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయా రక్షణగోడలకు మరమ్మతులు నిర్వహించారు. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు ఇలా.. రాకపోకలు ఎలా?

» వంచులదుర్గం వాగు వద్ద బ్రిడ్జి లేక పది గ్రామాల గిరిజనుల అవస్థలు

రహదారులే ప్రగతికి కొలమానం. మరి ఈ చిత్రాలను చూస్తే ఎలా అర్థం చేసుకోవాలి. నిత్యం 'దారీ'తెన్నూ లేని జీవితాలను గిరిపుత్రులు అనుభవిస్తున్నారు. రోజూ ఆదివాసీల 'నరక' యాతనలు, ఏదో మూల డోలీల మోతల ఆక్రందనలు కొండ కోనల్లోనే ఆవిరవుతున్నాయి.


పంచులదుర్గం వాగు వద్ద రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్న ఆదివాసీలు

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడుముసారి పంచాయతీ వంచులదుర్గం వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మార్గంలో సుమారు పది గ్రామాల ఆదివాసీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం వంచులదుర్గం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనాలకు అంతరాయం కలుగుతోంది. స్థానికులు పలుమార్లు గత వైసీపీ ప్రభుత్వ పాలకుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పరిష్కారంకాలేదని ఆరోపిస్తున్నారు. గత ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ కూడా కార్యరూపం దాల్చడంలేదు. ఈ నేపథ్యంలో వంచులదుర్గం వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.


గింజంగి రహదారిపై మధ్యన పడిన రంధ్రం

గింజంగి రహదారిపై భారీ గొయ్యి

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ గింజంగి రహదారిపై వర్షాలకు భారీ గొయ్యి పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. గింజంగి ప్రధాన రహదారిలో వనబలింగి గ్రామ సమీపంలో గతంలో కురిన వర్షాలకు పడిన చిన్నపాటి గొయ్యి కాస్తా ప్రస్తుతం పెద్ద పరిణామంలోకి మారింది. రహదారి మధ్యలో ఈగొయ్యి వల్ల రాత్రివేళ ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ స్పందించి రహదారిపై గొయ్యిని పూడ్చి ప్రజల అవస్థలు తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కొయ్యూరులో సోమ, మంగళవారాల్లో డోలీ మోతలు తప్పని సరయ్యాయి.


కొయ్యూరు మండలం ముల్లుమెట్ట నుంచి డోలీలో మోసుకెళుతున్న గ్రామస్తులు (ఫైల్)

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్


యోగాసనం వేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటూ సంపూర్ణ ఆరోగ్యానికి వీలవుతుందని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో యోగా గురు పతంజలి శ్రీనివాస్ నిర్వహించిన యోగా శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ యోగాసనాలు వేసి, అనంతరం మాట్లాడారు. యోగాతో బహుళ ప్రయోజనాలున్నాయని, అందుకే గిరిజన విద్యార్థులకు వీటిలో శిక్షణ అందిస్తున్నామన్నారు.ప్రయోగాత్మకంగా హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో గిరిజన విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు. యోగా గురు ప్రణవ సంకల్ప యోగ సమితి వ్యవస్థాపకులు, పతంజలి శ్రీనివాస్ ముందుగా విద్యార్థులతో సూర్య నమస్కారాలు, పశ్చిమోత్తానసనం, సర్వాంగాసనం, హలాసనం, చక్రాసనాలను చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాణ్యమైన కాఫీని పండించాలి'


శిరసపల్లిలో కాఫీ పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పెదబయలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన కాఫీ పండించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని గలగండా పంచాయితీ శిరసపల్లి గ్రామ శివారున కాఫీ తోటలను ఆయన సందర్శించారు. కాఫీ రైతు కుంతూరు బొజ్జన్నతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో అడిగితెలుసుకున్నారు. పూర్తిగా పండిన కాఫీ పండ్లను మాత్రమే సేకరించాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం రకం ఆధారంగా ధరలను ప్రకటించినట్టు చెప్పారు. దళారుల వద్ద మోసపోకుండా నేరుగా జీసీసీకే అమ్మకాలు జరపాలని కోరారు. మిరియాలు సేకరణకు నిచ్చెనలు మంజూరు చేయాలని రైతులు కోరగా, సానుకూలంగా స్పం దించారు. గ్రామంలో కొర్ర మత్స్యరాజు కుమార్తె భానుప్రియ సికిల్‌సెల్ ఎనిమియా బాధపడుతుందని తెలుసుకొని ఆ మెకు పింఛన్ మంజూరు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నంద్, ఉద్యానవన అధికారి ఏ రమేశ్‌కుమార్, ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి

గూడెంకొత్తవీధి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంట వలిసెల సాగు ఆదివాసీ రైతులకు లాభదాయకమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. బుధవారం పరిశోధన స్థానం దత్తత గ్రామమైన దుశ్చరపాలెంలో గిరిజన రైతులకు వలిసెల సాగులో మెలకువలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ గ్రామంలో 40 మంది ఆదివాసీ రైతులు నూతన వలిసెల వండగం జేఎన్ఎస్- 28 విత్తనం పంపిణీ చేశామన్నారు. రైతులు నాట్లు వేసిన నాటి నుంచి శాస్త్రవేత్తలు సాంకేతిక సలహాలు, సూచనలుఇస్తున్నారన్నారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు, వ్యవసాయ సహాయకులు సంగీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వనసమారాధన ఉత్సాహంగా సాగింది. బుధవారం పాఠశాల మైదానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పనసల ప్రసాద్, హెచ్ఎం వి.అప్పారావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏజీ బీఎస్సీలో సీట్లు


ఏజీబీఎస్సీ సీట్లు పొందిన స్టీవెన్ రాజ్. ప్రవళిక

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రిసెట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన ఇద్దరు విద్యార్థులు ఏజీబీఎస్సీలో సీట్లు సాధించినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24లో అగ్రికల్చర్ డిప్లమో పూర్తి చేసిన విద్యార్థినులు అగ్రిసెట్ రాశారన్నారు. వీరులో రాష్ట్రస్థాయిలో ద్వితీయ, ఏడోవ, ఎనిమిదోవ ర్యాంక్‌లు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తొలివిడతలో ఏజీబీఎస్సీ సీట్లు వచ్చాయన్నారు. తాజాగా రెండో విడతలో 11వ ర్యాంక్ సాధించిన చింతపల్లికి గుర్రం స్టీవెన్ రాజ్‌కి ఉదయగిరి అగ్రికల్చర్ కళాశాలలో, 27వ ర్యాంక్ సాధించిన హుకుంపేటకు చెందిన కంబిడి ప్రవళికకు బాపట్ల కళాశాలలో సీట్లు లభించాయన్నారు. ఏజీబీఎస్సీలో సీట్లు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

మరో శిశువు మృత్యువాత


మృతి చెందిన శిశువు

జి. మాడుగుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం మరో శిశువు మృతి చెందింది. భీరం పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లుడు సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులకు పుట్టిన నాలుగు నెలల మగ బిడ్డ బుధవారం మృతి చెందింది. రెండు రోజులుగా అనారోగ్యానికి గురవడంతో బుధవారం స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అయితే, తల్లి పాలు పెట్టిన సమయంలో అవి ఊపిరితిత్తులకు చేరినట్టు వైద్యులు గుర్తించి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అయితే, అంబులెన్స్ ఎక్కించే లోపే శిశువు మృతి చెందింది. వరుస శిశు మరణాలతో పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

'గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట'

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే చట్ట సభలకు వెళ్లి సమస్యలు ప్రస్తావించకున్నా, ఆదివాసీ గ్రామాలఅభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాల నాయకులు గిడ్డి ఈశ్వరిపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో రహదారి విస్తరణను అడ్డుకుంటున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, కూటమి నాయకులు అబ్బాయినాయుడు, పండు, ఆంధ్రాబు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లేందుకు నిరాకరించిన గర్భిణులు

» కౌన్సెలింగ్ చేసి పీహెచ్‌సీకి తరలించిన వైద్యాధికారి » సుఖ ప్రసవం.. పండంటి మగబిడ్డలు జననం


చెక్క వంతెన దాటి వెళుతున్న వైదురాలు, సిబ్బంది


బాలింత, శిశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ దొరగొంది గ్రామంలో గుంట సంధ్య, గుంట తిలయిలకు నెలలు నిండాయి. దీంతో ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకురావాలని ఏఎన్ఎంలను వైద్యాధికారి సూచించారు. ఈ స్థితిలో రెండు రోజులుగా ఏఎన్ఎంలు మత్స్యకొండ, సీత, ఆశకార్యకర్త రాజేశ్వరి గర్భిణులు, కుటుంబ సభ్యులను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీంతో గ్రామానికి బుధవారం వైద్యాధికారి డీకే హిమబిందు వెళ్లి గర్భిణులు, కుటుంబసభ్యులతో మాట్లాడి ఆసుపత్రిలో ప్రసవం చేయించాలని వారికి నచ్చజెప్పారు. కుటుంబ సభ్యులు అంగీకరించారు. గర్భిణులను ఎట్టకేలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సాయంత్రానికి ఇద్దరు గర్భిణులు ఆస్పత్రిలో సుఖ ప్రసవం పొంది పండంటి మగబిడ్డలకు జన్మనిచ్చారు. ఈసందర్భంగా వైద్యాధికారిగ్రామానికి వెళ్లేందుకు అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొన్నారు. కిలో మీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులముందుగానే ఆస్పత్రిలో చేరాలన్నారు. గృహాల్లో ప్రసవాల వల్ల తల్లి, బిడ్డకు క్షేమం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లోవకుమారి, పారామెడికల్ ఉద్యోగులు బాలకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

లివిటిలో ప్రత్యేక వైద్య సేవలు


శిశువుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

హుకుంపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లివిటి గ్రామంలో శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక వైద్య సేవలు నిర్వహిస్తున్నట్టు ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి రేఖ అన్నారు మండలంలోని రాప పంచాయతీ లివిటిలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన శిశు మరణాలపై మరణాలపై వచ్చిన స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేకంగా గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించారు. ఇంటింటికీ వెళ్లి పలువురి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. బాలింతలకు బేబీ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు జలుబు, జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది ఉంటే ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని కోరారు. నాటుమందులు వాడరాదన్నారు. గ్రామంలో వరుసగా శిశువులు మృతి చెందడంపై విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఈసందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీహెచ్‌వో సన్యాసిరావు, హెల్త్‌అసిస్టెంట్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

'గిడ్డి ఈశ్వరిపై ఆరోపణలు సరికాదు'

జి. మాడుగుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాడేరు మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జీ గిడ్డి ఈశ్వరిపై ఆరోపణలు సరికాదని టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు పట్టణం మెయిన్ రోడ్డు విస్తరణపై ప్రజా సంఘాల నాయకుల ఆరోపణలను ఖండించారు. గిడ్డి ఈశ్వరి గతంలో బాక్సైట్, ఎర్రవరం హైడ్రో పవర్, జి. మాడుగుల మండలం పెదలోచలి నల్లరాయి క్వారీ అనుమతుల రద్దు, జీవో -3 పునరుద్ధరణ, ఉద్యోగుల సమస్యలు తదితర వాటిపోరాటాలను గిడ్డి ఈశ్వరి చేసినట్టు గుర్తు చేశారు. అలాంటి నేతపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాయకులు కిముడు కల్యాణం, వి. కృష్ణమూర్తి నాయుడు, జి.కొండబాబు, కె.రామకృష్ణ, ఆర్.కొండబాబు, కె.సత్యనారాయణ, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిడ్ మొక్కల పరిశోధనలో అధ్యాపకుడికి డాక్టరేట్


ఏయూనుంచి డాక్టరేట్ అందుకుంటున్న అధ్యాపకుడు జానకీరావు

పాడేరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో అరుదైన ఆర్కిడ్ మొక్కలపై పరిశోధన చేసిన స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకుడు ఎ.జానకీరావు ఏయూనుంచి డాక్టరేట్ పొందడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్‌డాక్టర్.వనుము చిట్టబ్బాయి తెలిపారు. కళాశాల లో వృక్షశాస్త్ర విభాగాధిపతి జానకీరావు ఆర్కిడ్ మొక్కలపై పరిశోధనలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తున్నారన్నారు. ఆయన ప్రొఫెసర్ ఎస్.బీ.పడాల్ పర్యవేక్షణలో 2018 నుంచి 2023 మధ్య ఈ పరిశోధనలు సాగించారన్నారు. జి.మాడుగుల మండలం అల్లంగాపుట్టుకు చెందిన జానకీరావు ఆర్కిడ్ మొక్కల పరిరక్షణలో చేసిన పరిశోధనలు వృక్షజాలం భవిష్యత్తుకు చాలా కీలకమైనవని అన్నారు. రాష్ట్రం నుంచి తొలిసారి సారిగా ఎనిమిది కొత్త ఆర్కిడ్ మొక్కలను ఈ ప్రాంతంలో కనుగొన్నారన్నారు. ఈ సందర్భంగా జానకీరావును కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఎన్‌జీ రంగా వర్సిటీ ఆర్‌ఈఏసీ సభ్యుడిగా బాలయ్య


బాలయ్యతో ఏడీఆర్ అప్పలస్వామి, శాస్త్రవేత్త బాల హుస్సేన్‌రెడ్డి

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి(ఆర్ ఈఏసీ) సభ్యుడి గా అభ్యుదయ రైతు వండలం బాలయ్య నియమితులైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.విశ్వవిద్యాలయం పరిధిలోనున్న ఆరు జోన్లలో నుంచి ఒక్కొక్క సభ్యుడిని ఎంపిక చేస్తారన్నారు. ఇందులో భాగంగా గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి చెందిన బాలయ్య ఉన్నారన్నారు. రెండేళ్ల పాటు ఆయన సభ్యుడిగా కొనసాగుతారన్నారు. వచ్చే జనవరిలో గుంటూరులో నిర్వహించే పరిశోధ, విస్తరణ సలహా మండలి సమావేశాలు హాజరకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల వినూత్న నిరసన

సమస్యల పరిష్కారానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి వినతి


ఉరితాళ్లతో నిరసన తెలుతుపున్న ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లోని ఉపాధ్యాయ, అధ్యాపకులు బుధవారం ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న తమను సీఆర్టీలుగా మార్చు మార్చాలని, 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 19వ రోజుకు చేరాయి. ఇటీవల వర్షాలను లెక్కచేయకుండా శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే, బుధవారం పాడేరులో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలకు హాజరైన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు గిరిజన సంక్షేమ గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ జిల్లా నాయకులు కొండబాబు, వెంకటేశ్వరరావు తదితరులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాలు రాష్ట్రంలో 169 ఉన్నాయన్నారు. 2008లో గెస్టు టీచర్స్ పేరుతో టీచింగ్ ఫ్యాకల్టీని రిక్రూట్ చేసిన ప్రభుత్వం 2012లో గెస్టు టీచర్లను పార్ట్‌టైం టీచర్స్‌గా మార్చు చేసి వేతనాలు పెంచారని, పార్ట్ టైం టీచర్స్‌గా ఉన్న తమను 2017లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చారన్నారు. తమకు మాత్రం ఎటువంటి వేతనాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

భూ వివాదాలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూవివాదాలు పరిష్కరించనున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులకు రెవెన్యూ సదస్సుల నిర్వాహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని 135రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6 నుంచి 8తేదీ వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుల్లో భూహక్కు, భూ వివాదాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆర్వోఆర్, అడంగల్, 1బి, ప్రభుత్వ భూముల రిజిస్ట్రర్లతో పూర్తి సమాచారాన్ని వీఆర్వోలు సిద్ధం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను 33 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ తప్పనిసరి: ఎంపీడీవో

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పొందేందుకు ప్రజలు విధిగా ఎన్‌పీసీఐ యాక్టివేషన్ ప్రాసెస్ చేయించుకోవాలని స్థానిక ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 8తేదీ లోగా ప్రజలు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. చేయించుకోని వ్యక్తులకు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు అందవన్నారు. అలాగే గృహాలను జియో ట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. హౌస్ హోల్డ్ మిస్సింగ్ ఎంప్లాయి, సిటిజన్ నమోదు చేయించుకోవాలన్నారు. పాఠశాలలను వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రతి వారం సందర్శించి మరుగుదొడ్లు తాజా పరిస్థితిని నివేదిక ఇవ్వాలన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు ఈ అంశాలను గ్రామ స్థాయిలో అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి'


ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరసన చేపట్టిన హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు

పాడేరురూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం పాడేరులో ర్యాలీ చేపట్టారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పీవో అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ. బంగ్లాదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అక్కడ ఉన్న హిందూ, క్రైస్తవ, మైనార్టీ ప్రజలపై దాడులు పెరిగాయన్నారు. యువతులపై అత్యాచారాలు, హత్యలకు తెగబడి అల్లరి మూకలు పేట్రేగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 44 దేశాల్లో జరుగుతున్న ర్యాలీలో భాగంగా తాము ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

గంగవరంలో టెర్రసింగ్ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

సీలేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ గంగవరంలో రూ.3.5లక్షల ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా టెర్రసింగ్ నిర్మించనున్నట్టు సర్పంచ్ నడిగొట్ల రాజు తెలిపారు. బుధవారం ఈ పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ జలాల సంరక్షణకు టెర్రసింగ్ పనులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జాబ్ కార్డులులేని వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే ఉపాధి అధికారులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, వార్డు సభ్యుడు పుల్లయ్య, వీఆర్‌పీ బాకూరి లింగరాజు, గోవిందు పాల్గొన్నారు.

గంజాయి జోలికి వెళ్తే జీవితాలు నాశనం

ముంచంగిపుట్టు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి, సారాయి జోలికి ఎవరూ వెళ్లరాదని, వాటి వలన జీవితాలు నాశనం అవుతాయని దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగ స్వామి అన్నారు. పంచాయతీ పరిధి పెద్దపేటలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ గంజాయి సాగు చేయరాదని, విక్రయాలు చేపట్టరాదని సూచించారు. ప్రత్నామ్నాయంగా రాగులు, పిప్పల్లు, మిరియాలు తదితర పంట సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శరవేగంగా మోడల్ స్టేషన్ భవన నిర్మాణం

- ఐదేళ్లూ అసంపూర్తిగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- శిథిల భవనంలోనే పోలీసుల విధుల నిర్వహణ
- కూటమి ప్రభుత్వం రావడంతో ఆరేళ్ల తర్వాత ఊపందుకున్న పనులు
- పూర్తయితే పోలీసులకు ఎంతగానో ఉపయుక్తం



ప్రారంభానికి సిద్ధం చేస్తున్న మోడల్ పోలీసు స్టేషన్ భవనం

కృష్ణాదేవిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట మోడల్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ భవన నిర్మాణ పనులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి మరలా ఊపందుకున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ 2019లో ఈ స్టేషన్‌ను సందర్శించినప్పుడు భవన దుస్థితిని చూసి అసహనం వ్యక్తం చేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న ఈ భవనాన్ని తొలగించి మోడల్ స్టేషన్ నిర్మించాలని ఆయన సంకల్పించారు. దీంతో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి రూ.2.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో భవన నిర్మాణాన్ని ప్రారంభించి పిల్లర్లు, పునాదులు పూర్తిచేశారు. తర్వాత ప్రభుత్వం మారిపోవడం, చేసిన పనులు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

అప్పటి నుంచి అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ భవన నిర్మాణం, కూటమి ప్రభుత్వం రావడంతో మరలా పునఃప్రారంభమైంది. ప్రస్తుతం విద్యుత్ వైరింగ్, గ్రానైట్ తదితర పనులు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా మొత్తం పనులు పూర్తిచేసి రంగులు వేయానికి పోలీసు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న భవనంలో పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, ఈ భవనం అందుబాటులోకి వస్తే ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఎప్పుడిస్తారో..?

- దరఖాస్తు చేసి ఐదు నెలలైనా అందని కనెక్షన్
- అక్కరకు రాని వ్యవసాయ బోర్లు.. రైతుల అగచాట్లు

దేవరాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. వ్యవసాయ బోర్లు తీసి విద్యుత్ లైన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఐదు నెలలైనా కనీస సందృన లేకపోతోంది. ఫలితంగా వ్యవసాయ బోర్లు నిరుపయోగంగా మిగిలిపోయాయి.

మండలంలోని వివిధ గ్రామాల్లో 20కి పైగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ లైన్‌లు కావాలని రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇది జరిగి ఐదు నెలలు గడిచినా నేటికీ లైన్‌లు వేయలేదు. సరికదా వాటి గురించి పట్టించుకునే నాథులే లేకపోయారు. వరి, కూరగాయల పంటలు వేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని బోర్లు వేసుకున్నామని, ఇప్పుడు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో అవి ఎందుకూ పనిరాకుండా ఉన్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌లు వేసి వ్యవసాయ బోర్లకు కనెక్షన్లు ఇవ్వాలని వారు వేడుకుంటున్నారు.

అడిగితే అదిగో ఇదిగో అంటున్నారు..

-కర్రి వెంకటరావు, రైతు, నాగయ్యపేట



నాగయ్యపేట గ్రామంలో నాతో పాటు దాసరి అమ్మన్న, కొట్యాడ రమణ బోర్లు తీసుకున్నాం. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఐదు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటికీ కనెక్షన్ రాలేదు. సంబంధిత లైన్‌మన్‌ను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు.

అయ్యప్ప భక్తులకు అండగా చిరుద్యోగి

- మూడు పూటలా సుమారు 400 మందికి టిఫిన్, భోజనాలు
- పైడిసాల గ్రామంలో మూడేళ్లుగా సొంత నిధులతో అందిస్తున్న దొరబాబు




పైడిసాలలో దొరబాబు ఏర్పాటు చేసిన భిక్షలో అయ్యప్ప భక్తులు... దొరబాబును సత్కరిస్తున్న స్వాములు

మాకవరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సేవలో ఓ చిరుద్యోగి తరిస్తున్నారు. చేసేది చిన్న ఉద్యోగమైనా పెద్ద బాధ్యతను నిర్వహిస్తుడడంతో అయ్యప్ప మాలధారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పైడిపాల గ్రామానికి చెందిన వంగలపూడి దొరబాబు భద్రాచలంలోని ఐటీసీ కంపెనీలో చిరు ఉద్యోగం చేస్తున్నారు. పదేళ్లుగా మాల వేసుకుంటున్న ఆయన, తనలాంటి అయ్యప్ప భక్తులకు ఏదైనా సేవ చేయాలని యోచించారు. ఇందులో భాగంగా మాలధారణ చేస్తున్న భక్తులకు ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నారు. పైడిపాల గ్రామంలో 2022లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. మొదటిలో 150 నుంచి 200 మంది భక్తులు వచ్చేవారు. ప్రస్తుతం 350 నుంచి 400 మందికి మూడు పూటలా టిఫిన్, భోజనాలను అందిస్తున్నారు. స్నేహితులు కొంత సాయం చేస్తున్నా, 14 రోజుల పాటు సొంత డబ్బులతో దొరబాబు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. 41 రోజుల పాటు భక్తులకు భోజనాలు వడ్డించడానికి అతని కుటుంబీకులు కూడా సహాయం అందిస్తున్నారు. దీంతో దొరబాబును స్వాములతో పాటు పలు గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.



మన గ్రోమోర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ ప్రభాకర్

పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

దేవరాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగుల మందులు, ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.ప్రభాకర్ బుధవారం తనిఖీలు చేశారు. హేమ రైతు డిపోను, మన గ్రోమోరు షాపులు తనిఖీ చేసి పురుగులు మందుల బాటిల్‌పై తేదీలను, రికార్డులను పరిశీలించారు. పురుగులు మందు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఏవో ఎల్.వై.కాంతమ్మ పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా కలరింగ్, హ్యాండ్ రైటింగ్‌లో రోలుగుంట విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రోలుగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్‌ఇండియా కలరింగ్, హ్యాండ్ రైటింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. ఆర్ట్ సెంటర్ భావ్‌నగర్ గుజరాత్ వారు ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహించారు. పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ సారథ్యంలో 25 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇద్దరు బంగారు పతకాలు, ఒక విద్యార్థి వెండి పతకం సాధించారు. ఈ మేరకు విద్యార్థులకు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందించారు. విద్యార్థులను హెచ్‌ఎం ప్రసాద్ అభినందించారు.

గౌరీపరమేశ్వర్ల అనుపు మహోత్సవం



గౌరీపరమేశ్వర్లు

రావికమతం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎంపురంలో బుధవారం గౌరీపరమేశ్వర్ల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో కార్తీక మాసం ఆరంభంలో గౌరీపరమేశ్వర్లను స్థానిక ప్రజలు నెల కొల్చారు. నెల రోజుల పాటు రోజు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సమయంలో జానపద కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం అనుపు మహోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం కోలాటాలు, జానపద నృత్యాలతో అనుపు మహోత్సవం వైభవంగా ముగిసింది.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్

మాకవరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ సూచించారు. మాకవరపాలెం పోలీసు స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్లు విన్నూత రీతిలో మోసాలు చేస్తున్నారని, దీనిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించకూడదని ఆయన సూచించారు. అలాగే యువకులు గంజాయికి దూరంగా ఉండాలని కోరారు. వీటిపై గ్రామాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టు రాము మృతి బాధాకరం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



రాము చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తాతయ్యబాబు

చోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై సత్వరం స్పందించే బుచ్చెయ్యపేట ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ సిరిగిరిశెట్టి రాము మృతి బాధాకరమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. బుధవారం రాము స్వగృహం బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి తలలో నాలుకలా ఉండి, సమస్యలపై సత్వరం స్పందించే గుణం రాము సొంతమని కొనియాడారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ వడ్డాది గ్రామ అభివృద్ధి విషయంలో అన్ని రాజకీయ పక్షాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి తోడ్పాటు అందించేవాడన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రతి నిధులు జోగినాయుడు, చంద్రరావు, సీహెచ్‌ఎల్‌బీ స్వామి, బీజేపీ నేత ఈర్లె శ్రీరామమూర్తి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, తెలుగుయువత నేత ఎస్.శ్రీరామమూర్తి, చోడవరం, మాడగుల ప్రెస్‌క్లబ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నాయుడు, సత్యనారాయణ, నాయకులు, జర్నలిస్టులు, రాము కుమారుడు గణేశ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వం తీసుకుంటే బీమా'



టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న గిరిజనులు

చీడికాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ బీమా వర్తిస్తుందని టీడీపీ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చలుగు అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోనాం శివారు గుంటు గిరిజన గ్రామంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని, సభ్యత్వం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రమాద బీమాతో పాటు అంత్యక్రియలకు రూ.10 వేలు అందు తుందన్నారు. ఇప్పటికే కోనాం పంచాయతీలో 500కుపైగా సభ్యత్వాలను తీసుకున్నారని, భవిష్యత్తులో మరిన్ని సభ్యత్వాల నమోదుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.



రహదారి సౌకర్యం కల్పించాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు

డోలీ మోతల నుంచి విముక్తి కల్పించండి

- నేరేడుబంద గిరిజనుల వినూత్న నిరసన

రావికమతం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండ శిఖర గ్రామమైన నేరేడుబందకు రహదారి నిర్మించి డోలీ మోతల నుంచి విముక్తి కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీవీటీజీ గిరిజన సంఘ నాయకుడు కిల్లో సూరిబాబు ఆధ్వర్యంలో బుధవారం గ్రామ ఆదివాసీలు గుర్రాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఈ గ్రామం నుంచి పిల్లలు రోజూ చదువు కోసం గుర్రాలపై రానుపోను ఆరు కిలోమీటర్ల కొండ దిగువనున్న జెడ్.జోగుంపేటకు రాకపోకలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరికి అనారోగ్యం చేస్తే డోలీ మోతతో కొండ కిందకు దింపి కొత్తకోట ఆసుపత్రికి తరలించాల్సి వస్తున్నదని వాపోయారు. రహదారి సౌకర్యం కల్పించాలని అనేక సార్లు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సమస్యను విశాఖపట్నం వస్తున్న సీఎం చంద్రబాబుకు తెలిపేందుకే ఈ విధంగా నిరసన తెలిపినట్టు చెప్పారు. అలాగే పిల్లలకు నోటరీ లేకుండా ధ్రువపత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, నేరేడుబంద గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాకవరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేషన స్పందన లభించింది. మాకవరపాలెంలో శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విశాఖపట్నంలో శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు గౌరీ, శివ మనోహర్, ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



ఆర్డీవో వీవీ రమణకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నర్సీపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న దాడులు, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీకన్య కూడలి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వివిధ నినాదాలతో ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఆర్డీవో వీవీ రమణకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజం ద్వారా బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తీసుకువచ్చి అక్కడ మత విశ్వాసాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల వెలగానారాయణరావు, పాకలపాటి అరవిందరాజు, నడిపల్లి నాగరాజు, కాళ్ల సుబ్బారావు, వెలగా జగన్నాథ్, నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. మండలంలోని వీరవల్లి, పోతనపూడి అగ్రహారం తదితర గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏవో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన అవసరమని చెప్పారు. వివిధ పంటలకు బీమా చేసుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు నష్టపరిహారం లభిస్తుందన్నారు. ఇందుకోసం రైతులు అపరాల పంటకు ఒక ఎకరానికి రూ3.00 చొప్పున ఈ నెల 15వ తేదీలోగా తేదీలోపు చెల్లించాలన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసే వరి పంట ఒక ఎకరానికి రూ.630 చొప్పున ఈ నెలాఖరులోపు చెల్లించాలని ఆయన తెలిపారు. ఆధార్‌కార్డు, వన్‌బీ, బ్యాంకు పాసు పుస్తకం, సాగు ధ్రువీకరణ పత్రాలతో మీసేవ కేంద్రాలకు లేదా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి బీమా రుసుము చెల్లించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పనలపై ఉప్పుద్రావణం పిచికారీ చేయాలి



కొమిరలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

గొలుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోసిన వరి పనలు వర్షాలకు తడిస్తే ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలని మండల వ్యసాయాధికారి సుధావాణి సూచించారు. మండలంలోని కొమిర గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు తడిసిన వరి పనలపై రెండు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే వరి కంకులు మొలకెత్తకుండా ఉంటాయని చెప్పారు. మినుములు, పెసర్లకు బీమా సౌకర్యం ఉందన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఎకరాకు రూ.300 చొప్పున అపరాలకు చెల్లించి బీమా పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యూటీ థెరపీ కోర్సులో ఉచిత శిక్షణ

చోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి బ్యూటీ థెరపీ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కోర్సు వ్యవధి రెండు నెలలు ఉంటుందని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 5 నుంచి 8వ తేదీలోగా కళాశాలకు వచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ కోర్సు పూర్తి వివరాల కోసం 9494791935 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములు కండి

రావికమతం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్ఐ ఎం.రఘువర్మ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాదక ద్రవాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కొంత మంది మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన సందర్భాలు ఉంటున్నాయన్నారు. ఇటువంటి వారికి విద్యార్థులు కౌన్సెలింగు ఇచ్చి, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే తమకు సమాచారం ఇస్తే వారికి నేరుగా కౌన్సెలింగు ఇస్తామన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సభలు

గొలుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ నెల 6న కొత్తమల్లంపేట రెవెన్యూ గ్రామంలో సభ ప్రారంభించి, జనవరి 7వ తేదీ వరకూ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సభల్లో రెవెన్యూ సంబంధమైన సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

7న సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి

మాడుగుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్థసారథిస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు దుక్కా రమణారెడ్డి తెలిపారు. శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని చెప్పారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఐదు గ్రామాలకు జీవీబీ బ్రాంచి ఏర్పాటుచేయాలి

నాతవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీపట్నం, గన్నవరం, వైబీపట్నం, వైబీఅగ్రహారం, విబీఅగ్రహారం గ్రామాలను గునుపూడి గ్రామీణ వికాస్ బ్యాంకు నుంచి వేరుచేసి ప్రత్యేక బ్రాంచి ఏర్పాటు చేయాలని గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లి వరహాలబాబు కోరారు. ప్రస్తుతం ఈ గ్రామాల డ్వాక్రా మహిళలు నెలానెలా బ్యాంకు అప్పు కట్టాలంటే కాకినాడ జిల్లా కోటనందూరు మండలం మీదుగా ప్రయాణించి 20 కిలోమీటర్లు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రుణాలు తీసుకోవాలంటే ఆటో కూడా దొరకని సందర్భంలో రైతులు, మహిళలు నరకం చూస్తున్నారన్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాలకు ఎ.శరభవరం లేదా తాండవ సెంటర్‌లో బ్రాంచి ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు.

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

మాడుగుల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్ రోడ్డు జంక్షన్‌లో వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం శంకుస్థాపన చేస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు 12.7 కిలోమీటర్ల మేర రూ.23.59 కోట్ల ఎన్‌డీబీ నిధులతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం గొటివాడ అగ్రహారంలో రూ.70 లక్షలతో నిర్మించిన రక్షిత నీటి పథకం వాటర్ ట్యాంకును ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి కూటమి శ్రేణులు హాజరుకావాలని కోరారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి విద్యార్థులు

నక్కపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చెందిన కొల్నాటి నాగ తరుణ్, మనబాల దిలీప్‌కుమార్ జాతీయ స్థాయి అండర్-14 హాకీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం రాణీలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెలాఖరున బోపాల్‌లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ అద్దూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కొల్నాటి రేవతి, ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.సుందరరావు, ఉపాధ్యాయులు టీవీ రమణ, షేక్ బీబీ అభినందించారు.

నితీష్ కల నెరవేరింది



కోహ్లికి అతడు వీరాభిమాని

బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌లోకి వెళుతున్న కుమారుడిని చూసి తండ్రి మురిసిపోతే... ఆటలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తాడేమోనని తల్లి ఆందోళన చెందేది. ఈ సందిగ్ధావస్థలో తండ్రి నమ్మకాన్ని నిలబెట్టడంతో పాటు తల్లి భయాన్ని పోగొట్టాలని సంకల్పించుకుని అటు చదువులో రాణిస్తూ, ఇటు క్రికెట్‌లో పరుగుల వరద పారించాడు. అండర్-14 కేటగిరీ నుంచి వివిధ ఏజ్ గ్రూప్‌లలో వరుసగా రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో చోటు దక్కించుకుని ఆట తీరుతో టీమిండియా సెలక్టర్ల దృష్టిని ఆకర్షించి, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో స్థానం సంపాదించాడు నగరానికి చెందిన యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి. త్వరలో జరగనున్న ఐపీఎల్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు రూ.ఆరు కోట్ల పారితోషకంతో ఎంపికై మరో రికార్డు నెలకొల్పాడు. ఈ సందర్భంగా అతడి తల్లిదండ్రులు మానస, ముత్యాలరెడ్డి తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- విశాఖపట్నం స్పోర్ట్సు, ఆంధ్రజ్యోతి

- విరాట్ చేతుల మీదుగా క్యాప్ తీసుకోవడం మధురానుభూతి
- కపిల్‌దేవ్‌తో పోల్చడం గర్వంగా ఉంది
- యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి తల్లిదండ్రుల అంతరంగం

నితీష్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఆసక్తి. పట్టుదలతో సాధన చేసేవాడు. తొలుత అండర్-16 జట్టుకు ఎంపికై విజయ్ మర్చంట్ ట్రోఫీలో తొలిమ్యాచ్ నాగాలాండ్‌పై 345 బంతుల్లో 441 పరుగులతో సత్తా చాటాడు. టోర్నీలో సగటున 176 పరుగులతో 1,237 పరుగులు చేసి రికార్డు నెలకొల్పాడు. బీసీసీఐ నుంచి అండర్-16 ఉత్తమ క్రికెటర్ అవార్డు అందుకున్నాడు. కోచ్‌లు, నిపుణులు, మేధావులు సలహాతో సీమర్‌గా బౌలింగ్‌పై దృష్టి సారించి ఆల్‌రౌండర్‌గా మలచుకున్నాడు.

ఐపీఎల్‌తో సెలక్టర్ల దృష్టికి..

గతంలో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నితీష్‌ను రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. గత ఏడాది అదే జట్టులో చేరి పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 64 పరుగులతో జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. తర్వాత రాజస్థాన్ రాయల్స్‌పై అజేయ అర్ధసెంచరీ (76) చేసి టీమిండియా సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు.

బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు పిలుపు

బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు టీమిండియా నుంచి నితీష్‌కు పిలుపువచ్చింది. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌కు నితీష్ పేరు వినిపించినా చివరివరకూ ఉత్కంఠ మధ్య ఎంపికచేశారు. పెర్త్ టెస్టులో ఆడే అవకాశం రావడం, తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 41 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 38 నాటౌట్ చేయడం ఆనందాన్నిచ్చింది.

కోహ్లి చేతుల మీదుగా క్యాప్

నితీష్‌కు టీమిండియా క్యాప్‌ను కోహ్లి అందించడం గొప్ప గౌరవంగా భావించాం. ఒకప్పుడు అతనితో ఫొటో తీసుకుంటే చాలనుకున్న యువకుడికి...ఇప్పుడు కలిసి బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. నితీష్ కూడా ఫోన్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నాడు. కల నెరవేరిందన్నాడు. నితీష్‌కుమార్‌ను నాటి గొప్ప ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్‌తో పోల్చడం మరింత ఆనందాన్నిచ్చింది.

కోహ్లితో కలిసి మైదానంలో...

చిన్నప్పటి నుంచి విరాట్ కోహ్లి, ధోనీ, రోహిత్‌శర్మ వంటిస్టార్ ఆటగాళ్లంటే నితీష్‌కు ఇష్టం. కోహ్లికి వీరాభిమాని. స్టేట్ ప్లేయర్‌గా ఆడుతున్న సమయంలో ఒకసారి కోహ్లితో ఫొటో తీసుకునేందుకు యత్నించి విఫలమయ్యాడు. ఇప్పుడు తన అభిమాన క్రికెటర్ విరాట్ కోహ్లితో నితీష్‌కుమార్ కలిసి ఆడుతుంటే టీవీలో చూసి చాలా సంతోషించాం. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లి సెంచరీ చేసిన సమయంలో నితీష్‌కుమార్ క్రీజులో ఉండడం, నితీష్‌ని కోహ్లి కౌగిలించుకోవడం మధురానుభూతిని ఇచ్చింది.


కోహ్లితో నితీష్

ఐపీఎల్‌లో అత్యధిక ధర

సన్‌రైజర్స్ హైదరాబాద్ నితీష్‌ను వేలానికి పెట్టకుండా రూ.ఆరు కోట్లతో జట్టులో కొనసాగించడం విశేషం. నితీష్‌ను ఆదినుంచీ విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ), ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రోత్సహించాయి. అతడి ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌కే ప్రసాద్ కడపలోని అండర్-14 క్రికెట్ అకాడమీకి ఎంపిక చేశారు.


తల్లిదండ్రులతో నితీష్‌కుమార్‌రెడ్డి

నమ్మకాన్ని నిలబెట్టాడు

- ముత్యాలరెడ్డి, నితీష్‌కుమార్‌రెడ్డి తండ్రి

నితీష్‌ను ఉత్తమ క్రికెటర్‌గా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో సర్వీసు ఉండగానే ఉద్యోగాన్ని వదిలేశాను. రోజూ గ్రౌండ్‌కు తీసుకువెళ్లడం, తీసుకురావడమే నా డ్యూటీ. అండర్-16 స్టేట్ టీమ్‌లోకి ప్రవేశించిన తర్వాతే వదిలిపెట్టాను. ఆర్థిక సమస్యలు తలెత్తినా నితీష్ తల్లి మానస ధైర్యంగా కుటుంబాన్ని నడిపించింది. టీమిండియాలో నితీష్ చేరడం, అభిమాన క్రికెటర్లతో క్రీజును పంచుకోవడం టీవీలో చూసినప్పటి నుంచి పడిన కష్టాలను మరిచిపోయాం.

నేడు, రేపు భీమిలిలో కళాఉత్సవ్

భీమునిపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌ను ఈనెల 5,6 తేదీల్లో భీమిలిలో నిర్వహిస్తున్నామని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న బాల బాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. గాత్ర సంగీతంలో శాస్త్రీయ, జానపద, భక్తి, దేశభక్తి గీతాలు, సోలో, ఐదుగురు సభ్యుల బృందం, వాద్య సంగీతంలో శాస్త్రీయ, సంప్రదాయ, మెలోడి, నృత్యంలో శాస్త్రీయ, సోలో, ప్రాంతీయ జానపద సమకాలీన, నాటక రంగంలో ఏకపాత్రాభినయం, మిమిక్రీ అంశాల్లో పోటీలుంటాయి. దృశ్యకళలో 2డి, 3డి, సంప్రదాయ బొమ్మల తయారీ, ప్రాంతీయ కలల వస్తువుల తయారీ, సంప్రదాయ కథ చెప్పడంలో బుర్రకథ, ఒగ్గు కథ ఉంటాయన్నారు.

డీఆర్‌వో దయానిధికి సాదర వీడ్కోలు


బదిలీపై వెళుతున్న డీఆర్ఓ దయానిధిని సన్మానిస్తున్న కలెక్టరు, జేసీ తదితరులు

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా బదిలీపై వెళుతున్న జిల్లా రెవెన్యూ అధికారి బలివాడ దయానిధికి సాదర వీడ్కోలు పలికారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, వివిధ విభాగాల అధికారులు దయానిధికి శాలువా కప్పి సత్కరించారు.

భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

వుడాలో రూ.540 కోట్ల కుంభకోణం కేసుపై లోకాయుక్త తీర్పు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుష్కరం క్రితం విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా-ఇప్పుడు వీఎంఆర్‌డీఏ)లో వెలుగుచూసిన భారీ భూ కుంభకోణం కేసుకు ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త ఎట్టకేలకు ముగింపు పలికింది. చేతులు మారిన భూములను కాపాడాలని ఆదేశించింది. కుంభకోణంలో భాగస్వాములైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇతర వ్యక్తులపై క్రిమినల్ కేసులు కొనసాగించాలని స్పష్టంచేసింది. అన్యాక్రాంతమైన భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, వాటిని వెనక్కి తీసుకోవాలని పేర్కొంది. ఈ కేసులో సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ విడివిడిగా విచారణ చేపట్టాయని, వారి నివేదికలన్నీ అందాయని, వాటిపై చర్యలు తీసుకున్నామని పురపాలన పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నివేదిక ఇవ్వడంతో ఈ కేసును క్లోజ్ చేస్తున్నామని ఉప లోకాయుక్త రజని బుధవారం తెలిపారు.

తునిలో వైశ్యరాజు జ్యువెలర్స్ ప్రారంభం


తునిలో వైశ్యరాజు జ్యువెలర్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధాబాలు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుని పెంటకోటదరి బాలాజీ కాంప్లెక్సు ఎదురుగా వైశ్యరాజు జ్యువెలర్స్ నూతన షోరూమ్ బుధవారం ప్రారంభమయింది. తుని మునిసిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధాబాలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదట చక్కా సూర్యనారాయణ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొదటి షోరూమ్ తునిలోనే ప్రారంభించామన్నారు. వినూత్న కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను నగదు/యూపీఐ/ ఈ-ట్రాన్స్‌ఫర్ ద్వారా ఫ్లాట్ 6 శాతం తరుగుకే అందిస్తున్నామన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జీఎస్టీ కూడా తామే చెల్లిస్తామని పేర్కొన్నారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.10వేల వరకు తగ్గింపు ఇస్తామని, ఈ ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ షోరూమ్‌నకు వచ్చి ప్రత్యేక డిజైనరీ కలెక్షన్లు ఎంపిక చేసుకొని ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ప్రారంభోత్సవంలో వైశ్యరాజు జ్యువెలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, చక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు, అధిక సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీ తుహిన్ సిన్హా


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

దేవరాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, రవాణాకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పరిష్కారం కాకపోవడానికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గంజాయి రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టులు పెట్టామన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు, ప్రజలకు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు తప్పవన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రావణి, సి.ఐ. పైడినాయుడును ఎస్.ఐ. మల్లీశ్వరరావు వున్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ కింద చేపడుతున్న నిర్మాణ పనులను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై ఆమె సమీక్షించారు. ఉపాధి పనులపై క్షేత్ర సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఉపాధి పనులు కాస్త నెమ్మదించాయన్నారు. ఆయా మండలాల సిబ్బంది పనులు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ పూర్ణిమదేవి, డీపీవో శిరీష రాణి, సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో లక్ష్మణ్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో భద్రతాలోపంపై ప్రభుత్వం సీరియస్

- గత సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్‌లపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో వరుసగా చోటుచేసుకున్న ఉదంతాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అందుకు కారకులుగా భావిస్తూ కొద్దిరోజులు కిందటి వరకూ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్.కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ కుమారవిశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కారాగారం లోపల నుంచి కొందరు ఖైదీలు రాత్రి వేళ ఫోన్ కాల్స్ మాట్లాడుతున్నట్టు కాల్‌డేటా రికార్డ్ (సీడీఆర్)లో అధికారులు గుర్తించారు. అలాగే గోదావరి బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఉప్పాడ గౌరీశంకర్ బ్యారెక్ లోపల వెంటిలేటర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జైలు ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గంజాయి ప్యాకెట్లను లంచ్ బాక్స్‌లో పెట్టుకుని ఖైదీలకు అందజేసేందుకు వెళుతూ సెక్యూరిటీకి పట్టుబడ్డాడు. దీంతో కేంద్ర కారాగారంలో భద్రత, అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌ను అనంతపురం జైలు సూపరింటెండెంట్‌గా, అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలు అదనపు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంట్ చేశారు. మరోవైపు వరుస ఉదంతాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, సెక్యూరిటీ, గార్డు డ్యూటీలు చేసేవారికి సెక్షన్ మార్కకపోవడం, జైలు భద్రత, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణ లోపించడమే కారణంగా తేలింది. దీంతో వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వంద కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

- ప్రధాన నిందితుడు పరారీ


పట్టుకున్న గంజాయితో డీఎస్పీ శ్రావణి, సీఐ, ఎస్ఐ పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 100 కిలోల సరకును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వి.మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర మహేశ్‌కుమార్, తాటికొండ రాజేశ్, జి.మాడుగుల మండలం వి.కొండపల్లి గ్రామానికి చెందిన ఉల్లి కొండబాబు, మరో వ్యక్తి కలిసి ఏజెన్సీలో వంద కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దీనిని విశాఖ తరలించడానికి కారులో బయలుదేరారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం అనకాపల్లి రూరల్ పోలీసులు ఊడేరు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. దీంతో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు కారును వెనక్కు తిప్పి, పరారవ్వడానికి ప్రయత్నించారు. రూరల్ ఎస్ఐ రవికుమార్, పోలీసు సిబ్బంది వెంటనే కారును చుట్టుముట్టారు. అప్పటికే ఒక వ్యక్తి కారులో నుంచి దిగి పరారయ్యాడు. మిగిలిన మహేశ్‌కుమార్, రాజేశ్, కొండబాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులో 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. కాగా పరారైన వ్యక్తి ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు ఇతని కోసం గాలిస్తున్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై పీడీ యాక్టు అమలు చేసి వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని డీఎస్పీ శ్రావణి స్పష్టం చేశారు. సమావేశంలో రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

శాఖల అధికారులకూ కంపెనీ యాజమాన్యమే సమాచారం ఇచ్చింది. కానీ వారు వేర్వేరు కారణాలు వెల్లడించారు.

ఫ్యాక్టరీస్ అధికారులు ఫాస్జీన్ గ్యాస్ వెలువడిందని పేర్కొన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌లో క్లోరిన్ కలుపుతున్నప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి పెరిగిందని, యాసిడ్ బయటకు రాగా దానిపై సోడా జల్లారని, దాంతో ఫాస్జీన్ వాయువు వచ్చిందని, అది విషపూరితం కావడంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

క్లోరిన్ వాయువు వెలువడిందని కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది. వాస్తవానికి క్లోరిన్ వాసన సులువుగానే గుర్తించవచ్చు. 0.002-3.4 పీపీఎం స్థాయిలోనే వాసన తెలుస్తుంది. క్లోరిన్ వాయువు వస్తున్నప్పుడు దానిని పీలుస్తూ కార్మికులు అక్కడే ఎందుకు ఉంటారు?, ఘాటైన వాసన కాబట్టి దూరంగా వెళతారు. అది కనీస జాగ్రత్త. కానీ, బయటకు వచ్చింది క్లోరిన్ వాయువు అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా నిర్ధారించారో వెల్లడించలేదు.

ఇవీ అనుమానాలు...

- హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవు. అంటే రియాక్షన్ ఏమీ ఉండదు. అటువంటిది విషవాయువు ఎలా వచ్చింది?, ఎక్కడి నుంచి వచ్చింది?
- రియాక్టర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రియాక్టర్‌లో పోసినప్పుడు రియాక్షన్ ఉండదు. అటువంటపుడు ప్రెషర్ (ఒత్తిడి) ఎక్కడి నుంచి వచ్చింది?
- వెంట్ ఎందుకు తెరుచుకుంది?, అందులో నుంచి లిక్విడ్ ఎలా బయటకు వచ్చింది?

..ఇవన్నీ ప్రమాద స్థలిలో పరిశీలించాల్సిన ప్రాథమిక అంశాలు. కానీ రెండు శాఖల అధికారులు యాజమాన్యం చెప్పిన చిలక పలుకులే పలుకుతున్నారు తప్ప సొంతంగా విచారణ చేసి ఏమీ చెప్పడం లేదు. అనుమతి లేకుండా హెచ్‌ఐవీ మందులు తయారుచేయడం, అనుభవం లేని పనివారితో పనిచేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి అనేక తప్పిదాలు ఉన్నాయి.

తరలింపులో అలసత్వం

ఘటన నవంబరు 26వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు జరిగింది. ఆ స్థలంలో ఉన్న కార్మికులు బి-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటలు) ముగిసిన తరువాత యాజమాన్యానికి చెప్పారు. వారిని 27వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు ఆస్పత్రిలో చేర్చారు. అంటే ఘటన జరిగిన 9 గంటల తరువాత వారిని చికిత్సకు పంపారు. కానీ యాజమాన్యం తక్షణమే పంపించామని చెబుతోంది. విషవాయువును పీల్చిన వెంటనే చికిత్సకు తరలిస్తే ప్రాణాలు దక్కేవి. కానీ 9 గంటలు ఆలస్యం కావడంతో ఇద్దరి ప్రాణాలు పోయాయి. ఇప్పటికి కూడా చనిపోయిన కార్మికులు పీల్చిన వాయువు ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు.

కెం...

ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి ఒకరి మృతి


సూరిబాబు (ఫైల్)

కొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి లారీ హెల్పర్ మృతి చెందిన సంఘటన అనకాపల్లి మండలం బవులవాడలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలివి. చోడవరం మండలం దుడ్డుపాలెం గ్రామానికి చెందిన గాలి సూరిబాబు(36) లారీ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో క్రషర్‌లో డస్టు లోడింగ్ నిమిత్తం అనకాపల్లి మండలం బవులవాడలో ఉన్న శ్రీవెంకట శశి స్టోన్ క్రషర్‌కు లారీలో వచ్చాడు. అక్కడ ఎక్స్‌కవేటర్‌తో లోడింగ్ చేసే క్రమంలో సూరిబాబుకు బకెట్ తగిలి కుప్పకూలి పోయాడు. వెంటనే స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి


చంటి (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట హైవే వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ మేస్త్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి పిరుమల చంటి(75) బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తుని వెళ్లి తిరిగి వస్తుండగా ఒడ్డిమెట్ట వద్ద తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

40 లీటర్ల సారాతో మహిళ అరెస్టు

చోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐటీఐ కాలనీలో నాటుసారా విక్రయిస్తున్న జలగడుగుల దుర్గ అనే మహిళను బుధవారం అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శేఖరం తెలిపారు. సీఐ కేవీపీ నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడిలో సారాతో పట్టుబడిన మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఎనీ టైమ్ మందు!

... 5వ పేజీ తరువాయి

మద్యం సరఫరా చేసి పట్టుబడితే రూ.5 లక్షలు జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే సంబంధిత షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్న ప్రభుత్వం ఆదేశాలు, హెచ్చరికలను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు అమలు చేయడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటైన తరువాత అక్టోబరు 16 నుంచి నవంబరు 30వ తేదీ వరకు జిల్లాలో 83 బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 84 మందిపై కేసులు నమోదు చేశారు. 251.89 లీటర్ల మద్యం, 9.75 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ మద్యం ఏయే దుకాణాల నుంచి సరఫరా అయ్యిందో తెలుసుకునే వీలు వున్నప్పటికీ అధికారులు ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

- సుధీర్, ఏఈఎస్, అనకాపల్లి జిల్లా

మద్యం బెల్టు షాపులకు, పర్మిట్ రూమ్‌లకు అనుమతి లేదు. వీటిని అతిక్రమిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. మద్యం బెల్టు దుకాణాలపై మూడు ప్రత్యేక బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయి. బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తుంటే 7702278287 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తనిఖీలు జరిపి చర్యలు చేపడతాం.

సంక్షోభంలో మరో ఫెర్రో పరిశ్రమ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు ఆందోళన విరమించి విధులకు హాజరయారు. కాగా కాంట్రాక్టు కార్మికులకు కూడా రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించడంలేదు. దీంతో పది రోజుల క్రితం ఆందోళన చేయడంతో యాజమాన్యం దిగివచ్చి ఒక నెల జీతం ఇచ్చింది. మరో నెల జీతం త్వరలో ఇస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు హాజరవుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614